మృత్యు కూడళ్లు


అన్నవరప్పాడు వద్ద సెంట్రల్ లైటింగ్, సర్వీస్ రోడ్లు లేని హైవే కూడలి


సెంట్రల్ లైటింగ్, సర్వీస్ రోడ్లు లేని ఖండవల్లి హైవే కూడలి

- జాతీయ రహదారి కూడళ్ల వద్ద తరచూ ప్రమాదాలు
- మూడేళ్లలో మండలంలో 355 యాక్సిడెంట్లు
- రక్షణ చర్యలు తీసుకోని హైవే అధికారులు

పెరవలి: గ్రామాల్లో జాతీయ రహదారి కూడళ్లు ప్రమాదాలకు నిలయంగా మారాయి. గ్రామాల రహదారులు జాతీయ రహదారికి అనుసంధానమయ్యే ప్రాంతాల్లోనే ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తున్నాయి. పెరవలి మండలంలో 15 కిలోమీటర్ల పొడవునా జాతీయ రహదారి విస్తరించి ఉంది. పెరవలి, నల్లాకులవారిపాలెం, ఖండవల్లి, అన్నవరప్పాడు గ్రామాల హైవే కూడళ్లు మృత్యు కుహరాలుగా మారాయి. ఈ కూడళ్ల వద్దే గ్రామ రహదారుల మలుపులు ఉండడంతో రెండో వైపు నుంచి వచ్చే వాహనాలు కనిపించవు. ఫలితంగా వాహనదారులు ఉదయం, సాయంత్రం వేళల్లో రోడ్డు దాటేటపుడే ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆ సమయాల్లో పొలాలకు వెళ్లే రైతులు, దూర ప్రాంతాల నుంచి వచ్చి వెళ్లే ప్రయాణికులతో హైవే కూడళ్లు రద్దీగా ఉంటాయి. హడావుడిగా రోడ్డు దాటే క్రమంలో వేగంగా వచ్చే వాహనాలకు ఢీకొని ప్రమాదాల పాలవుతున్నారు.


ఖండవల్లి వద్ద ప్రమాదానికి గురై నుజ్జునుజ్జయిన ఆటో (ఫైల్)

మూడేళ్లలో 97 మంది మృత్యువాత

గత మూడేళ్లలో జాతీయ రహదారిపై పెరవలి మండలంలో అధికారికంగా 355 ప్రమాదాలు సంభవించాయి. వాటిలో 225 మంది క్షతగాత్రులవగా మిగిలిన 97 మందీ ప్రాణాలు కోల్పోయారు. ఇవే కాకుండా రికార్డుల్లో నమోదు కాని మరెన్నో ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఇవన్నీ కూడా గ్రామ కూడళ్ల వద్దే జరగడం విశేషం. జాతీయ రహదారి ఏర్పడి దశాబ్దాలు గడుస్తున్నప్పటికీ ఎన్‌హెచ్ అధికారులు ఇప్పటికీ గ్రామ కూడళ్ల వద్ద రక్షణ పరంగా చేయవలసిన ఏర్పాట్లు చేయలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అందుకే ఈ స్థాయిలో ప్రమాదాలు జరుగుతున్నాయనే విమర్శలు వస్తున్నాయి.

మండల పరిధిలో 6 బ్లాక్ స్పాట్‌లు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో జాతీయ రహదారి 100 కిలోమీటర్ల పొడవునా విస్తరించి ఉంది. ఎక్కువ ప్రమాదాలు మాత్రం పెరవలి మండల పరిధిలోనే సంభవిస్తున్నాయని పోలీసు రికార్డులు చెబుతున్నాయి. జాతీయ రహదారిపై ఎక్కడెక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయి? అందుకు కారణాలు ఏమిటని 2016లో కేంద్ర ప్రభుత్వం ఓ బృందాన్ని నియమించింది. సర్వే జరిపిన ఈ బృందం జిల్లాలో 16 బ్లాక్ స్పాట్లను గుర్తించింది. వాటిలో ఆరు బ్లాక్ స్పాట్‌లు ఒక్క పెరవలి మండలంలోనే ఉన్నాయని పేర్కొనడం విశేషం. సర్వే తర్వాత ప్రమాదాల నివారణకు తాత్కాలిక చర్యలతో సరిపెట్టారే తప్ప శాశ్వతంగా పరిష్కరించలేదు. గ్రామ కూడళ్ల వద్ద సర్వీస్ రోడ్లు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని అప్పట్లో సర్వే బృందం సూచించినా అది నేటికీ అమలు కాలేదు. 2015లో ఖండవల్లి వద్ద జాతీయ రహదారిపై ఓ ప్రమాదం సంభవించింది. అదే సమయంలో తూర్పుగోదావరి జిల్లా నుంచి తాడేపల్లి వెళుతున్న అప్పటి డీజీపీ సాంబశివరావు తానే స్వయంగా కారు దిగి క్షతగాత్రులను తన కారులో ఎక్కించుకుని తణుకు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు.

గత మూడేళ్లలో జరిగిన ప్రమాదాలు

పోలీసు రికార్డుల ప్రకారం జాతీయ రహదారిపై మండల పరిధిలో గత మూడేళ్లలో సంభవించిన ప్రమాదాల్లో 97 మంది మృతి చెందారు. 2021–22–లో 41 మంది, 2022–23లో 43 మంది, 2023–24లో ఇప్పటివరకూ 13 మంది మృతి చెందారు. పోలీసు రికార్డుల్లో నమోదు కాని, రాజీ పడి, నమోదు కాని కేసులు మరెన్నో. నివారణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

జాతీయ రహదారి నిబంధనలు

జాతీయ రహదారి నిర్మాణంలో ఎన్‌హెచ్ అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. గ్రామ కూడళ్ల వద్ద డివైడర్లను (రోడ్డు కటింగ్‌లు) ఏర్పాటు చేసినపుడు గ్రామాల నుంచి వచ్చే రహదారులకు ఎక్కడా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయలేదు. ఈ డివైడర్ల వద్ద పాదచారులు, వాహనదారుల కోసం జీబ్రా గుర్తులు వేయాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. ఈ గుర్తులు ఉన్నట్టయితే వాహనదారులు ఆ ప్రాంతాన్ని గ్రామ కూడలిగా గుర్తించి వేగాన్ని తగ్గించి వెళతారు. డివైడర్ల వద్ద ప్రమాద హెచ్చరికలు తెలిపే బొమ్మలు వేయవలసి ఉన్నా, ఏర్పాటు చేయలేదు. వాహనాల వేగాన్ని తగ్గించడానికి స్పీడ్ కంట్రోల్ స్టాప్ బోర్డులను కాని, సర్వీస్ రోడ్లు, ఐరన్ మెషెలు గాని ఏర్పాటు చేయలేదు. జాతీయ రహదారి గ్రామ కూడళ్ల వద్ద ఎక్కడా సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు చేయలేదు. అందువల్లే గ్రామ కూడళ్ల వద్ద ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని పలువురు స్థానికులు పేర్కొంటున్నారు.

ఫైర్‌స్టేషన్ నిర్మాణానికి కట్టుబడి ఉన్నాం

జిల్లా అగ్నిమాపక అధికారి మార్టిన్ కింగ్

దేవరపల్లి: స్థానికంగా అగ్నిమాపక కేంద్రం నిర్మాణానికి కట్టుబడి ఉన్నామని జిల్లా అగ్నిమాపక అధికారి ఎం.మార్టిన్ కింగ్ తెలిపారు. ఫైర్‌స్టేషన్ నిర్మాణం జరిగేనా? అనే శీర్షికన బుధవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. అగ్నిమాపక కేంద్రం భవన నిర్మాణానికి గతంలోనే మండలంలోని రామన్నపాలెంలో స్థలం కేటాయింపు జరిగిందన్నారు. న్యాయపరమైన అంశాల వల్ల అక్కడ నిర్మించాలన్న ప్రతిపాదనను ఉపసంహరించుకున్నామని తెలిపారు. ప్రస్తుతం వేరొక చోట స్థల కేటాయింపు కోసం కలెక్టర్‌కు ప్రతిపాదనలు సమర్పించినట్టు మార్టిన్ కింగ్ తెలిపారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారన్నారు. అనువైన మరొక స్థలాన్ని కేటాయించాక భవన నిర్మాణం చేపడతామని తెలిపారు.

రూరల్ ఎస్సైగా శ్రీహరిరావు బాధ్యతల స్వీకరణ



కొవ్వూరు: రూరల్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా కర్రి శ్రీహరిరావు బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఇక్కడ పని చేసిన కె.సుధాకర్ కాకినాడ జిల్లా తిమ్మాపురం బదిలీ అయ్యారు. దేవరపల్లి ఎస్సైగా పని చేస్తున్న శ్రీహరిరావును బదిలీపై కొవ్వూరు రూరల్ ఎస్సైగా నియమించారు. గతంలో ఈయన పోలవరం ఎస్సైగా కూడా పని చేశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై శ్రీహరిరావును సిబ్బంది కలసి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు మెరుగైన పోలీసు సేవలందించేందుకు కృషి చేస్తానని ఆయన ప్రకటించారు.

తాళ్లపూడి ఎస్సైగా రామకృష్ణ



తాళ్లపూడి: మండలంలో ట్రాఫిక్ సమస్య పరిష్కరించడంతో పాటు, శాంతిభద్రతల పరిరక్షణకు పాటు పడతానని ఎస్సై టి.రామకృష్ణ అన్నారు. తాళ్లపూడి ఎస్సైగా నియమితులైన టి.రామకృష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. స్టేషన్ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికి అభినందనలు తెలిపారు.

యూనిఫాం అందజేత


విద్యార్థినికి యూనిఫాం అందజేస్తున్న దాతలు

దేవరపల్లి: యర్నగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు 35 మందికి ఒక్కొక్కరికి రెండేసి జతల చొప్పున యూనిఫాం బుధవారం అందజేశారు. ఇందుకోసం దేవరపల్లికి చెందిన యువ పారిశ్రామికవేత్త శ్రీకాకొళపు కాశీవిశ్వనాథం రూ.20 వేలు, పార్డ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ రూ. 17 వేలు సమకూర్చాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఛత్రపతి చిశాజీ, కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ గద్దే శ్రీనివాసరావు, మహిళా ప్రతినిధి పుట్టా వీరమణి, పార్డ్ ఇండియా ప్రతినిధి ఎస్.వెంకట్రావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తూనికలు, కొలతల శాఖ తనిఖీలు


తనిఖీల్లో పాల్గొన్న సబ్ కలెక్టర్ శ్రీవాస్తవ, లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్

కొవ్వూరు: నిడదవోలు, కొవ్వూరు పట్టణాల్లో బుధవారం తూనికలు, కొలతల శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. నిబంధనలు ఉల్లంఘించిన నలుగురు వ్యాపారులపై కేసులు నమోదు చేసినట్టు లీగల్, మెట్రాలజీ కొవ్వూరు ఇన్‌చార్జ్ ఇన్‌స్పెక్టర్ జీవీ ప్రసాద్ తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన, సూచించిన ప్రకారం కిలో కందిపప్పు రూ.150 రేటుకు, బియ్యం కిలో రూ.47 నుంచి 48 రేటుకు విక్రయించాల్సి ఉందన్నారు. స్థానిక సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, లీగల్ అండ్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ (ఏలూరు) బి.సాయిరామ్ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు జరిపామన్నారు. ప్యాకేజ్డ్ కమోడిటిస్ నిబంధనలు ఉల్లంఘించిన వ్యాపారులపై కొవ్వూరులో రెండు, నిడదవోలులో మరో రెండు కేసులు నమోదు చేశామని చెప్పారు. కొవ్వూరు సివిల్ సప్లయి తహసీల్దార్ ఎం.సునీత తదితరులు ఈ తనిఖీల్లో పాల్గొన్నారు.

రజక ఫెడరేషన్ చైర్మన్ పదవి రామారావుకు కేటాయించాలి

గోపాలపురం: రజకుల సంక్షేమం కోసం విశేషంగా పాటుపడిన కాకినాడ రామారావుకు రజక ఫెడరేషన్ చైర్మన్ పదవి కేటాయించాలని అఖిల భారత దోబీ సంఘం రాష్ట్ర కార్యదర్శి జొన్నాడ శ్రీనివాస్, రజక చైతన్య సేవాసంస్థ జిల్లా కన్వీనర్ ఊనగట్ల నాగపోశికృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని చిట్యాల గ్రామంలోని నాగ పోశికృష్ణ ఇంటి వద్ద బుధవారం కాకినాడ రామారావును ఘనంగా సత్కరించారు.

నీట్ ర్యాంకర్లకు కౌన్సెలింగ్‌పై అవగాహన

'శశి వేలివెన్ను' ఆధ్వర్యంలో నిర్వహణ


సదస్సులో పాల్గొన్న రవికుమార్, అతిథులు

ఉండ్రాజవరం: తమ సీనియర్ అధ్యాపక బృందం సారథ్యంలో ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రాం ద్వారా తమ విద్యార్థులు నీట్‌లో అత్యుత్తమ ర్యాంకులు సాధిస్తున్నారని మండలంలోని 'శశి వేలివెన్ను' విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి రవికుమార్ పేర్కొన్నారు. ఆ విద్యాసంస్థల ఆధ్వర్యంలో బుధవారం రాజమహేంద్రవరంలోని సూర్యా గార్డెన్స్‌లో నీట్ ర్యాంకర్లకు నీట్–2024 కౌన్సెలింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. రవికుమార్‌తో పాటు పిన్నమనేని సిద్ధార్థ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీ సెర్చ్ ఫౌండేషన్ ప్రిన్సిపాల్ ఎంవీ భీమేశ్వర్, ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ రిటైర్డ్ జాయింట్ రిజిస్ట్రార్ వీవీ సుబ్బారావు కౌన్సెలింగ్ గురించి వివరించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు శశి విద్యాసంస్థల వైస్ చైర్‌పర్సన్ బూరుగుపల్లి లక్ష్మీ సుప్రియ, అకడమిక్ డైరెక్టర్లు డాక్టర్ ఎంవీ రావు, చిట్టూరి శేషుబాబు పాల్గొన్నారు.

ఇండక్షన్ ప్రోగ్రాం

తాడేపల్లిగూడెం: స్థానిక శశి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం ఇంజనీరింగ్ విద్యార్థులకు బుధవారం ఇండక్షన్ ప్రోగ్రామ్ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ, వైస్ చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మహ్మద్ ఇస్మాయిల్, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తల్లి పాలతోనే సంపూర్ణ ఆరోగ్యం


ఉండ్రాజవరం మండలం తాడిపర్రులో సీమంతాలు

ఉండ్రాజవరం: తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్య రక్ష లభిస్తుందని ఐసీడీఎస్ ఉండ్రాజవరం, వేలివెన్ను సూపర్‌వైజర్లు ఎం.భాగ్యలక్ష్మి, సరోజిని అన్నారు. మండలంలో తాడిపర్రు, వేలివెన్ను గ్రామాల్లో బుధవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తాడిపర్రులో సర్పంచ్ కరుటూరి నరేంద్ర ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతాలు నిర్వహించి, వారికి చీరలు అందజేశారు. చిన్నారులకు అన్నప్రాసన చేశారు. వేలివెన్నులో సర్పంచ్ అత్తిలి సత్యనారాయణ ఆధ్వర్యంలో డాక్టర్ సృజన, డాక్టర్ ఇర్ఫాన్‌లు గర్భిణులు, బాలింతలకు ముర్రుపాలు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ కె.సుభాషిణి, పాఠశాల హెచ్‌ఎం కె.సరోజిని, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

త్యాజంపూడిలో..

దేవరపల్లి: మండలంలోని త్యాజంపూడి గ్రామంలో బుధవారం ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తల్లిపాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, వైద్య ఆరోగ్య సిబ్బంది గ్రామంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ పద్మావతి తన ప్రసంగంలో తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కాళ్ల వెంకటరత్నం, సెక్టార్ సూపర్‌వైజరు ఎం. శశికళ, ఏఎన్‌ఎం, ఆశావర్కర్లు, పంచాయతీ సభ్యులు పాల్గొన్నారు.

అనంతపల్లి, నల్లజర్ల సెక్టార్లలో..

నల్లజర్ల: ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్‌వీ కృష్ణవేణి సారథ్యంలో అనంతపల్లి సెక్టార్ పరిధిలోని ప్రకాశరావుపాలెం సబ్ సెంటర్లో బుధవారం తల్లులకు, గర్భిణులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించి, ప్రతిజ్ఞ చేయించారు. ఏఎన్‌ఎం వెంకటలక్ష్మి, కార్యకర్తలు విజయలక్ష్మి, కనకదుర్గ, బేబీ, సూర్యకుమారి, నాగమణి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే నల్లజర్ల సెక్టార్ పరిధిలో పోతినీడుపాలెంలో తల్లిపాల వారోత్సవాల ముగింపు సమావేశం నిర్వహించారు. సెక్టార్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, కార్యకర్తలు,ఏఎన్‌ఎం, తల్లులు, గర్భిణులు పాల్గొన్నారు.

కూలిన 'ఐ లవ్ కొవ్వూరు' గోడ


కొవ్వూరు గోదావరి మాత విగ్రహం జంక్షన్ వద్ద కూలిన సుందరీకరణ గోడ

కొవ్వూరు: గుర్తు తెలియని వాహనం మంగళవారం రాత్రి స్థానిక గోదావరి మాత విగ్రహం వద్ద రుడా నిధులతో సుందరీకరించిన గోడను ఢీకొట్టింది. సుమారు పది అడుగుల పొడవునా గోడ కూలిపోవడమే గాకుండా మరో 30 అడుగుల అడుగుల మేర పగుళ్లు వచ్చి కూలిపోవడానికి సిద్ధంగా ఉంది. గోడ లోపల ఏర్పాటు చేసిన వాటర్ పైప్‌లైన్ సైతం బయట పడింది. పోలవరం వెళ్లే జంక్షన్ వద్ద సుమారు రూ.20 లక్షలు వెచ్చించి ఇక్కడ 'ఐ లవ్ కొవ్వూరు' సింబల్‌తో పాటు గోదావరి మాత చుట్టూ వాటర్ ఫౌంటెన్ వంటివి ఏర్పాటు చేశారు. దీని నిర్వహణను కొవ్వూరు మున్సిపాలిటీ పూర్తిగా విస్మరించడంతో అధ్వాన్నంగా తయారైంది. సుందరీకరణలో భాగంగా వేసిన పచ్చిక పూర్తిగా గేదెలు పాడుచేశాయి. గోదావరి మాత చుట్టూ పిచ్చి మొక్కలు మొలిచాయి. ఈ జంక్షన్ వద్ద ఏర్పడిన గోతులను ఆర్ అండ్ బీ శాఖ పూడ్చక పోవడంతో అపరిశుభ్రంగా తయారైంది. ప్రస్తుతం కూలిన గోడను తక్షణ పునరుద్ధరించకపోతే భవిష్యతులు బీటలు తీసుకుని గోడ కూడా కూలిపోయే ప్రమాదం ఉంది.

బాలిక వైద్యానికి రూ.83 వేల సాయం


బాలిక వైద్యానికి రూ.83 వేల చెక్కు అందజేస్తున్న తిమ్మరాజుపాలెం సర్పంచ్ చంద్రశేఖర్, గ్రామస్తులు

నిడదవోలు రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తమ గ్రామానికి చెందిన బాలిక వైద్య ఖర్చులకు మండలంలోని తిమ్మరాజుపాలెం గ్రామస్తులు రూ.83 వేల ఆర్థిక సాయం అందించారు. వివరాలిలా ఉన్నాయి. ఈ గ్రామానికి చెందిన మారుగుడి ఏసు కుమార్తె విజయకుమారి ఈనెల 2న రోడ్డు దాటుతుండగా ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. కాలికి తీవ్ర గాయమైన ఆ బాలిక వైద్యానికి ఆరోగ్యశ్రీ వర్తించ లేదు. దాంతో గ్రామానికి చెందిన అరుంధతీయ సంఘ సభ్యులు, దాతలు స్పందించి, ఆ పంచాయతీ సర్పంచ్ ముప్పిడి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో రూ.83 వేలు సేకరించారు. ఈ మొత్తానికి చెక్కును రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలిక కుటుంబ సభ్యులకు బుధవారం అందజేశారు.

వృద్ధులకు అన్నదానం

రాజమహేంద్రవరం రూరల్: శాటిలైట్‌సిటీ ఏబ్లాక్ లోని వృద్ధులకు ఆశ్రయం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం అన్నదానం నిర్వహించారు. ట్రస్టు చైర్మన్ ఏకే మోహన్, వైస్ చైర్మన్ కె.బలరామ్, కోశాధికారి ఏ.కుసుమ కుమారి చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. ప్రతి బుధవారం వృద్ధులకు ట్రస్టు ద్వారా అన్నదానం నిర్వహిస్తామని తెలిపారు.

దేవతావృక్షం నరికేసిన వారిపై చర్యలు

కొవ్వూరు: స్థానిక గోష్పాద క్షేత్రంలోని దేవతావృక్షం (రావి చెట్టు) కొమ్మలు నరికేసిన వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ ప్రకటించారు.ఈ వృక్షాన్ని అక్రమంగా నరికివేసిన విషయాన్ని బుధవారం కుమారదేవం వచ్చిన జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి దృష్టికి కొవ్వూరు మీడియా ప్రతినిధులు తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఆమె విచారించాల్సిందిగా సబ్ కలెక్టర్‌కు సూచించారు. దీంతో సబ్ కలెక్టర్ గోష్పాద క్షేత్రానికి విచ్చేసి వృక్షాన్ని పరిశీలించారు. వృక్షాన్ని నరికిన వ్యక్తులపై వాల్టా చట్ట ప్రకారం పోలీసులకు ఫిర్యాదు చేసి కేసు నమోదు చేయించాల్సిందిగా ఇన్‌చార్జ్ తహసీల్దార్ అజయ్‌బాబును ఆదేశించారు. కాగా ఈ వృక్షాన్ని రాజమహేంద్రవరం రోటరీ క్లబ్ ప్రతినిధులు కూడా పరిశీలించారు. కొమ్మల నుంచి చిగుళ్లు వచ్చేలా కెమికల్ ట్రీట్‌మెంట్ ద్వారా చర్యలు తీసుకుంటామని క్లబ్ ప్రతినిధి రాజా తెలిపారు.


కొమ్మలు నరికేసిన వృక్షాన్ని పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

నల్లజర్ల హైస్కూల్‌కు విరాళం

నల్లజర్ల: అధ్యాపకుడు వాడ్రేవు సుందరరావు, సీతామహాలక్ష్మి దంపతులు తమ కుమారుడు శేషసాయి జ్ఞాపకార్థం రూ.50 వేలను నల్లజర్ల హైస్కూల్‌కు బుధవారం విరాళంగా అందజేశారు.

కళాశాల్లో చేనేత దినోత్సవం

కొవ్వూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో ప్రిన్సిపాల్ జె.సునీత ఆధ్వర్యంలో బుధవారం జాతీయ చేనేత దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు.అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

దేవరపల్లి: యర్నగూడెంలో ఇటీవల సంభవించిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయి నిరాశ్రయులైన అడబాల రాము, మహాలక్ష్మి కుటుంబాలను బుధవారం జనసేన పార్టీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి డి.సువర్ణరాజు పరామర్శించారు. రెండు కుటుంబాలకు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కాట్నం గణేష్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

మెట్ట ప్రాంతంలో కుండపోత వర్షాలు

- ముంపు నుంచి తేరుకొంటున్న తరుణంలో వరుణ ప్రతాపం
- దుక్కులకు అవకాశం ఇవ్వని వైనం
- ఆందోళన చెందుతున్న రైతులు

దేవరపల్లి: రెండు రోజులుగా మెట్ట ప్రాంతంలో కుండపోత వర్షం కురుస్తోంది. గత నెల 18న ప్రారంభమైన వర్షాలు దాదాపు 12 రోజులు ఎడతెరిపి లేకుండా కురిశాయి. భారీ వర్షాలకు కాలువలు, వాగులు, చెరువులు పొంగి ఉధృతంగా ప్రవహించడంతో వేలాది ఎకరాల్లోని పంటను రైతులు కోల్పోయారు. రోజుల తరబడి వరి చేలు నీట మునిగి ఉండడంతో మూనలు కుళ్లిపోయాయి. ఎర్ర కాలువ, కొవ్వాడ కాలువ ముంపు వల్ల ఎక్కువగా రైతులు నష్టపోయారు. అధికారుల లెక్కల ప్రకారం కొవ్వూరు డివిజన్‌లో 5,607 మంది రైతులకు చెందిన 7,230 హెక్టార్లలో వరి, 451 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. నష్టం విలువ సుమారు రూ.8.75 కోట్లుగా అధికారులు లెక్కలు కట్టారు. వర్షాలు తగ్గడంతో వరద ఉధృతి తగ్గింది. నీట మునిగిన వరి చేలు చాలావరకూ ముంపు నుంచి తేరుకున్నాయి. తేరుకున్న పంటలకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టి పునరుద్ధరించే పనిలో ఉన్నారు. ఇలాంటి తరుణంలో రెండు రోజుల నుంచి మరలా కుండపోత వర్షాలు కురుస్తుండడంతో వారు ఆందోళన చెందుతున్నారు. వరి చేలు మరలా నీట మునిగితే పని చేయవని వారు భయపడుతున్నారు.

బలహీనపడ్డ కాలువ గట్లు

మెట్ట ప్రాంతంలోని తాడిపూడి, ఎర్ర కాలువ, కొవ్వాడ కాలువగట్లు బలహీన పడ్డాయి. గత 20 ఏళ్లగా కాలువల అభివృద్ధి జరగలేదు. పట్టించుకున్న నాథుడూ లేడు. ఏటా ఖరీఫ్ సీజన్‌లో సంభవించే వరదలకు నీట మునిగిన పంట చేలను ప్రజాప్రతినిధులు, అధికారులు వచ్చి పరిశీలించి రైతులను ఓదారుస్తున్నారు. అంతేతప్ప ముంపు శాశ్వత పరిష్కారానికి తీసుకున్న చర్యలు ఏమీ లేవు. దాదాపు 20 రోజులుగా వర్షాలు కురవడం వల్ల పొలాలు బీడు వారుతున్నాయని రైతులు వాపోతున్నారు. దుక్కులు తయారు చేసుకోవడానికి భూములు అదునుకు రాకపోవడంతో దుక్కులు ఆలస్యం అవుతున్నాయని రైతులు తెలిపారు. కూరగాయల పంటలు, పొగాకు నారుమడులు వేసే సమయం కావడంతో భూములు దుక్కలు తయారు చేసుకుని రైతులు సిద్ధం చేసుకోవలసి ఉంది.


కొవ్వూరు మెయిన్ రోడ్డులో కురుస్తున్న వర్షం


చాగల్లు మండలం, నెలటూరు వద్ద నిండుగా ప్రవహిస్తున్న పేముల కాలువ


తాళ్లపూడిలోని మెయిన్ రోడ్డుపై నిలిచిపోయిన వర్షపు నీరు

కొవ్వూరు: ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. బుధవారం తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకూ కొవ్వూరులో ముసురేసింది. విరామం లేకుండా చినుకులు పడుతూనే ఉన్నాయి. దీంతో జనం ఇళ్లకే పరిమితం అయ్యారు. మధ్యాహ్నం నుంచి చినుకులు తెరిపిచ్చాయి. ముసురుతో రైతులు మళ్లీ ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే కురిసిన భారీ వర్షాలు, గోదావరి వరద కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారు. రెండు రోజుల కిత్రమే అధికారులు పంట నష్టం అంచనాలు తయారు చేశారు. మళ్లీ ఇప్పుడు ముసురు పట్టడంతో పంట నష్టం విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉంటుందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.

తాళ్లపూడి: మండలంలో బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. పలు ప్రాంతాలు ముంపులో చిక్కుకున్నాయి. పలుచోట్ల రహదారులపైన, ఇళ్ల వద్ద నీరు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వర్షం వల్ల పౌర జీవనానికి అంతరాయం కలిగింది. తాళ్లపూడిలోని మెయిన్ రోడ్డు, ఎస్సీ ఏరియా, ప్రక్కిలంక రోడ్డు, వేగేశ్వరపురం గ్రామంలోని రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోయింది. దాంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. వర్షానికి పలు గ్రామాల రోడ్లు ఛిద్రమయ్యాయి. తాళ్లపూడిలోని ఆంధ్రా బ్యాంక్ నుంచి డిగ్రీ కళాశాలకు, ఆర్‌బీకేకు వెళ్లే రోడ్డు వర్షానికి దెబ్బ తినడంతో విద్యార్థులకు, ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.


ఇటీవలి భారీ వర్షాలకు దేవరపల్లి మండలం యర్నగూడెం వద్ద తాడిపూడి కాలువకు పడిన గండి (ఫైల్)

చాగల్లు: ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో మండలంలోని రోడ్లన్నీ జలమయం అయ్యాయి. నిడదవోలు – పంగిడి ప్రధాన రహదారిపై పలుచోట్ల వర్షపు నీరు చేరింది. పల్లపు ప్రాంతాల పంట పొలాల్లో వర్షపు నీరు చేరింది. ఎగువన కురిసిన వర్షాలతో మండలంలో పేముల కాలువ నిండుగా ప్రవహిస్తోంది.